# నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, బుధవారం 1 మే 2024 | HYDERABAD




తిరుమల్‌నగర్ కాలనీ కాలనీ వాసులతో కలిసి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



మారేడ్‌పల్లి అంబేద్కర్‌నగర్ బస్తీలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి నివేదిత, బీఆర్ఎస్ నాయకులు

## రేవంత్ సీఎం కాదు.. పీసీసీ అధ్యక్షుడే

### భాష మార్చుకో రేవంత్..!

ప్రజా సమస్యలు పరిష్కరించరు కానీ.. నోరు పారేసుకుంటారా.?

ప్రజలను తొమ్మిదేండ్లు కంటికి రెప్పలా చూసుకున్నాం..

మీరు నాలుగు నెలల్లోనే నరకం చూపుతున్నరు

బీసీలకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందాం

బడంగ్‌పేటలో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, ఏప్రిల్ 30 : రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కాలేదు.. ఆయన భాష చూస్తుంటే ఇంకా పీసీసీ హోదాలోనే కొనసాగుతున్నట్లు అనిపిస్తున్నది అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధి తిరుమల్‌నగర్‌లో చేవెళ్ల పార్లమెంటు ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలనీలలో ప్రజలు మా గొంతులు ఎండుతున్నాయని గగ్గోలు పెడుతున్నా.. పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఇదేమిటని ప్రశ్నిస్తే.. సీఎం రేవంత్ రెడ్డి నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నాడని అన్నారు. అధికారంకోసం అలవి కాని హామీలు ఇచ్చి.. ఇప్పుడు నోరు పారేసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. కేసీఆర్ పాలనలో తొమ్మిది సంవత్సరాల పాటు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా కంటికి రెప్పలా చూసుకున్నామని తెలిపారు. నాలుగునెలల్లోనే కాంగ్రెస్ పాలన అస్తవ్యస్తంగా మారిందని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన పనులే తమ కండ్ల ముందు కదలాడుతున్నాయని ప్రజలు చెప్తున్నారని తెలిపారు. కుల మతాలకు అతీతంగా కాసాని గెలుపు కోసం కృషి చేస్తున్నారని అన్నారు. బీసీలకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, కాసాని జ్ఞానేశ్వర్‌ను పార్లమెంటుకు పంపిస్తే బీసీ గొంతుగా బీసీల సమస్యలపై పోరాడుతాడని చెప్పారు. 400 కోట్లున్న వారికి 40 కోట్లున్న వారి మధ్యన జరుగుతున్న ఎన్నిక అన్నారు. సంపన్నులను మట్టి కరిపించి సామాన్యుడిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, మాజీ ఎంపీటీసీ సంరెడ్డి వెంకట్ రెడ్డి, మాజీ సర్పంచ్ ముత్యాల కృష్ణ, బీఆర్ఎస్ నాయకుడు బోయల్లి శేఖర్ రెడ్డి, కాలనీ అసోసియేషన్ నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

> రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కాలేదు.. ఆయన భాష చూస్తుంటే ఇంకా పీసీసీ హోదాలోనే కొనసాగుతున్నట్లు అనిపిస్తున్నది. అధికారంకోసం అలవి కానీ హామీలు ఇచ్చి.. ఇప్పుడు నోరు పారేసుకోవడం ఏమిటి ?



ఎన్నికల ప్రచారంలో భాగంగా సికింద్రాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్‌ను అలింగనం చేసుకొని గెలిచి రావాలని ఆశీర్వదిస్తున్న అవ్వ

## ప్రచార హోరు.. గులాబీ జోరు

కాంగ్రెస్‌లో నేతల మధ్య అంతర్గత విభేదాలు

బీజేపీకి క్యాడర్ లేక డీలా పడుతున్న అభ్యర్థులు

ప్రజాప్రతినిధులతో దూకుడు మీదున్న బీఆర్ఎస్ అభ్యర్థులు

సిటీబ్యూరో, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ) : పార్లమెంటు ఎన్నికల్లో అన్ని పార్టీల కంటే బీఆర్ఎస్ పార్టీ దూకుడుగా వ్యవహరిస్తున్నది. కాంగ్రెస్‌లో నేతల మధ్య అంతర్గత విభేదాలు, బీజేపీకి క్యాడర్ లేక ఆ పార్టీ అభ్యర్థులు డీలా పడుతుండగా.. బీఆర్ఎస్ అభ్యర్థులు మాత్రం బలమైన క్యాడర్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను సమన్వయం చేసుకుంటూ ప్రజాక్షేత్రంలో సత్తా చాటుతున్నారు. నియోజకవర్గ సమన్వయ సమావేశాలు, బూత్ స్థాయి కమిటీల సమీక్షలు, మార్నింగ్ వాక్‌లు, సాయంత్రం కాలనీ, అసోసియేషన్ సంఘాలతో సమావేశాలతో ప్రజలకు మరింత చేరువయ్యే కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసి బరిలో నిలిచే అభ్యర్థుల లెక్క తేలిపోవడంతో ప్రచారంలో మరింత జోరు పెంచారు. హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజిగిరి, చేవెళ్ల నియోజకవర్గ అభ్యర్థులు గడ్డం శ్రీనివాస్ యాదవ్, పద్మారావు గౌడ్, రాగిడి లక్ష్మారెడ్డి, కాసాని జ్ఞానేశ్వర్ ఉదయం, సాయంత్రం ప్రజాప్రతినిధులతో కలిసి ఇంటింటి ప్రచారాన్ని ఉధృతం చేశారు.

### గంపగుత్తగా ఓట్లు పొందేలా..

అభ్యర్థులు ప్రధానంగా సామాజిక వర్గాలపై దృష్టి సారించి వారి ఓట్లను గంపగుత్తగా పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందుకోసం వారితో ప్రత్యేకంగా సమావేశాల నిర్వహణకు సిద్ధమవుతున్నారు. ఈ నెల 13వ తేదీన లోక్‌సభ ఎన్నికలు ఉండగా.. ఒక రోజు ముందుగానే ఎన్నికల ప్రచారానికి ముగింపు పలకాల్సి ఉంది. ఈ నేపథ్యంలోనే తక్కువ సమయంలో ఎక్కువ మంది ఓటర్లను ఆకర్షించేందుకు పార్టీలు వ్యూహాలు రచిస్తున్నాయి. బూత్ స్థాయిలో ఎవరు ఎవరికి ఓటు వేయగలరో చెప్పే నాయకులను పట్టుకొని వీళ్లలో ఓటరు జాబితా పట్టుకొని టిక్కులు పెడుతున్నారు. అలా టిక్కులు పెట్టి వాట్సాప్ గ్రూప్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఆత్మీయ బస్తీ, కాలనీ సమావేశాలు ఏర్పాటు చేసి మద్దతు కూడగడుతున్నారు. మత పెద్దలు, సామాజిక వర్గాలు, గేటెడ్ కమ్యూనిటీలు, కాలనీ సంఘాలు, కార్మిక, ఉద్యోగ సంఘాలతో అభ్యర్థుల తరపున ముఖ్య నేతలు, కుటుంబ సభ్యులు సమావేశమై ఓట్లు అభ్యర్థిస్తున్నారు.

### సోషల్ మీడియాపై ప్రత్యేక నజర్

సోషల్ మీడియా వేదికగా అభ్యర్థుల ప్రచారం మరింత హీటెక్కింది. సెకన్ల వ్యవధిలో లక్షలాది మందికి చేరే అవకాశం ఉండడంతో ఇందుకోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసుకొని ఓటర్లకు దగ్గరయ్యే ప్రయత్నం చేస్తున్నారు. రోజువారీ తమ కార్యక్రమ వివరాలతో పాటు గెలిపిస్తే.. ఏం చేస్తామో వివరిస్తున్నారు. ఆదే సమయంలో తమపై ప్రత్యర్థులు చేసే ఆరోపణలకు కూడా కౌంటర్ ఇచ్చేలా వీడియోలు రూపొందించి జనాల్లోకి వదులుతున్నారు.

## అభివృద్ధి చేశాం.. ఆశీర్వదించండి

కాంగ్రెస్, బీజేపీలతో లాభం లేదు

ఎన్నికల ప్రచారంలో కంటోన్మెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి నివేదిత

మారేడ్‌పల్లి, ఏప్రిల్ 30 : పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని, మాజీ సీఎం కేసీఆర్ ఆశీస్సులతో కంటోన్మెంట్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా మీ ముందుకు వచ్చానని.. తనను అత్యధిక మెజార్టీతో గెలిపించి అసెంబ్లీకి పంపించాలని బీఆర్ఎస్ అభ్యర్థి జి.నివేదిత ప్రజల్ని కోరారు. మంగళవారం మోండా డివిజన్ రైల్ నిలయం అంబేద్కర్ నగర్ బస్తీలో మాజీ కార్పొరేటర్ ఆకుల రూప ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి నివేదిత ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తూ.. ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా అభ్యర్థి జి.నివేదిత మాట్లాడుతూ.. ప్రజలకు మాయమాటలు చెప్పి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పేద ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని తెలిపారు. ఆరు గ్యారెంటీలు అని హడావుడి చేశారు తప్ప వాటి అమలుపై దృష్టి సారించడం లేదని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీతో ప్రజలకు ఎలాంటి లాభం లేదని తెలిపారు. దివంగత ఎమ్మెల్యే జి.సాయన్న చేసిన అభివృద్ధి పనులు నేటికి ప్రజల ముందు ఉన్నాయన్నారు. అభివృద్ధి తమ నినాదం అని.. ఈ సారి ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఆకుల హరికృష్ణ, జీహెచ్ఎంసీ మాజీ కో ఆప్షన్ సభ్యుడు సీఎన్.నర్సింహ ముదిరాజ్, చిన్న, సుజన్ ముదిరాజ్, వినయ్, నారాయణ, రాము, జోడి బ్రదర్స్, మహిళా నాయకులు కుమారి, అనిత, సువర్ణ, మాధురి, భవాని, తదితరులు పాల్గొన్నారు.

## కిషన్ రెడ్డికి ఓటెందుకు వేయాలో ప్రశ్నించండి

అంబర్‌పేటలో బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ ప్రచారం

గోల్నాక, ఏప్రిల్ 30 : గత ఐదేండ్లుగా కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి అంబర్‌పేట నియోజకవర్గానికి పైసా పని చేయలేదని., ప్రచారానికి వస్తే ఓటు ఎందుకు వేయాలో ప్రశ్నించాలని సికింద్రాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి టి.పద్మారావుగౌడ్ ప్రజలను కోరారు. మంగళవారం ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ఆధ్వర్యంలో అంబర్ పేట డివిజన్ న్యూ పటేల్ నగర్, నరేంద్రనగర్, చెన్నారెడ్డినగర్, బాపూనగర్ తదితర ప్రాంతాల్లో బీఆర్ఎస్ నియోజకవర్గం సమన్వయకర్త దాసోజు శ్రావణ్, కార్పొరేటర్ విజయ్‌కుమార్ గౌడ్, అధ్యక్షుడు సిద్ధార్థ్ ముదిరాజ్, బీఆర్ఎస్ నేతలు దూసరి శ్రీనివాస్ గౌడ్, ఎర్రబోలు నరసింహ రెడ్డి, ఆంజనేయులు తదితరులతో పాటు వందలాది గులాబీ శ్రేణులతో కలిసి ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పద్మారావు మాట్లాడుతూ ప్రజల నుంచి వస్తున్న స్పందన చూస్తే.. గెలుపు ఖాయమైందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.



మన్సూరాబాద్ ఎంఈరెడ్డి గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న మల్కాజిగిరి పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి , పక్కన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

## కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల ఓట్లెక్కడ?

ఇక్కడ ఓటుహక్కులేని వారికి ఓటేస్తే ఏం లాభం

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి రాగిడి

మన్సూరాబాద్, ఏప్రిల్ 30 : కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజా సమస్యలను గాలికి వదిలేసిందని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి తెలిపారు. మల్కాజిగిరి పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా మంగళవారం మన్సూరాబాద్ డివిజన్ పరిధి ఎంఈరెడ్డి గార్డెన్‌లో ప్రజా సమస్యల పరిష్కార సమితి అధ్యక్షుడు గోపాల్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మల్కాజిగిరి పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. మల్కాజిగిరి పార్లమెంటులో ఓటు హక్కులేని కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులకు ఓటు వేస్తే లాభం లేదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, మాజీ అధ్యక్షులు కొసనం వెంకట్‌రెడ్డి, పోచబోయిన జగదీశ్ యాదవ్, నాయకులు నర్రి వెంకన్నకురుమ, ఏలుకొండ రాంకోటి, కేకేఎల్ గౌడ్, సుధాకర్‌నాయి, సూరజ్ యజ్ఞాని తదితరులు పాల్గొన్నారు.





శరత్‌సిటీ క్యాపిటల్ మాల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ఆటగాళ్లు

## శరత్ సిటీ మాల్‌లో.. సన్‌రైజర్స్ సందడి

అభిమానులతో మాట.. ముచ్చట

కొండాపూర్, ఏప్రిల్ 30 : సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ఆటగాళ్లు మంగళవారం కొండాపూర్‌లోని శరత్‌సిటీ క్యాపిటల్ మాల్‌లో సందడి చేశారు. సన్‌రైజర్స్ జట్టు అధికార భాగస్వామిగా ఉన్న రాన్ బ్రాండ్ స్టోర్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో జట్టు సభ్యులు హెన్రిచ్ క్లాసెన్, అబ్దుల్ సమద్, నితీష్ కుమార్ రెడ్డి, జయదేవ్ ఉనద్కత్, టీ నటరాజన్ పాల్గొని అభిమానులతో ముచ్చటించారు. పలువురు అభిమానులు అడిగిన సరదా ప్రశ్నలకు ఫన్నీ సమాధానాలు ఇచ్చారు.

## జీహెచ్ఎంసీకి కాసుల పంట

కలిసొచ్చిన 'ఎర్లీబర్డ్'

7.27 లక్షల మందికి పైగా సద్వినియోగం

రూ.820కోట్లకు పైగా ఆస్తి పన్ను వసూలు

సిటీబ్యూరో, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీకి ఎర్లీబర్డ్ స్కీం కలిసొచ్చింది. ముందుస్తుగా ఆస్తిపన్ను చెల్లించి 5శాతం రాయితీ పొందాలంటూ ఏప్రిల్ 1 నుంచి 30వ తేదీ వరకు యాజమానులకు జీహెచ్ఎంసీ అవకాశం కల్పించింది. 30 సర్కిళ్ల పరిధిలో సీఎస్‌సీ సెంటర్లు, బిల్ కలెక్టర్లు, మీ సేవా, ఆన్‌లైన్‌ల ద్వారా చెల్లింపుల ద్వారా రూ.800కోట్ల నిర్దేశిత లక్ష్యాన్ని ఖరారు చేసుకున్నది. ఇందులో భాగంగా 30సర్కిళ్లకు గాను 7.27 లక్షల మందికి పైగా వినియోగదారులు ఎర్లీబర్డ్‌స్కీంను సద్వినియోగం చేసుకున్నారు. దీంతో రూ.820 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టుకొని నిర్దేశిత రూ.800కోట్ల లక్ష్యాన్ని దాటింది. ఆన్‌లైన్‌లో రూ.400 కోట్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ల ద్వారా రూ.250 కోట్లు, రూ.155 కోట్లకు పైగా సీఎస్‌సీ సెంటర్లు, మీ సేవా సెంటర్ల ద్వారా ఎర్లీబర్డ్ చెల్లింపులు జరిగాయి. కాగా గతేడాది రూ.785.84కోట్ల మేర ఎర్లీబర్డ్ వసూలు కాగా.. ఈ ఏడాది సైతం నిర్దేశిత టార్గెట్‌ను అధిగమించిందని అధికారులు తెలిపారు. చివరి రోజు ఒక్కరోజే రూ.96.61కోట్లు వసూలైనట్లు అధికారులు పేర్కొన్నారు. గత ఏడాదికంటే 34.16 కోట్లు అధనంగా వసూలైనట్లు పేర్కొన్నారు. ఎన్నికల సమయంలోనూ ఈ స్థాయి మేర వసూలు రావడం అభినందనీయమని కమిషనర్ రొనాల్డ్ రాస్ కొనియాడారు.



### భగీరథ బంద్ రిక్షాలు ఇన్

గత పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నగరంలో కనిపించని నీటి కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. కనీసం నాలుగు నెలలు కూడా నిండకముందే బిందెలు, డబ్బాలు పట్టుకొని రోడ్లెక్కాల్సిన దుస్థితి రానేవచ్చింది. నగరవాసులు గుక్కెడు నీటికోసం అల్లాడిపోతున్నారని చెప్పేందుకు ఇంతకంటే సాక్ష్యం ఏముంటుంది. మంగళ వారం సికింద్రాబాద్ మినిస్టర్స్ రోడ్డులో రిక్షాపై డబ్బాల ద్వారా నీటిని తరలిస్తూ.. కనిపించిన దృశ్యమిది.

## సమస్యల వలయంలో ఉప్పల్ భగాయత్

మురికి కూపంలా, డంపింగ్ యార్డులుగా మారిన రోడ్లు

విజృంభిస్తున్న దోమలు, భద్రత పరంగానూ సమస్యలు

శాఖల మధ్య సమన్వయ లోపమే కారణం

హెచ్ఎండీఏ-జీహెచ్ఎంసీ అధికారులు నిర్లక్ష్యం వీడాలని స్థానికుల వేడుకోలు

సిటీబ్యూరో, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ) : మాస్టర్ ప్లాన్ నిబంధనలకు అనుగుణంగా, ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసిన ఉప్పల్ భగాయత్ లేఅవుట్‌లో మౌలిక వసతుల కల్పనలో హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ విఫలమైంది. ఉప్పల్ మెట్రో డిపో, నాగోల్ మెట్రోస్టేషన్ ఇరువైపులా సుమారు 430కి పైగా ఎకరాల్లో మూసీ వెంబడి హెచ్ఎండీఏ భారీ లేఅవుట్‌ను అభివృద్ధి చేసింది. ఇందులో అత్యంత విశాలమైన 150, 120, 80, 60 ఫీట్ల వెడల్పుతో కూడిన రోడ్లను, మూసీ వెంబడి తీరం ప్రాంతంలో 3 కి.మీ పొడవైన పార్కును అభివృద్ధి చేశారు. నివాసాలకు అత్యంత అనువుగా ఉండడంతో పెద్ద ఎత్తున వ్యక్తిగత ఇళ్ల నిర్మాణంతో పాటు అపార్టుమెంట్లు, భారీ బహుళ అంతస్థుల భవనాలు ఉప్పల్ భగాయత్ లేఅవుట్‌లో భారీ సంఖ్యలోనే పూర్తి చేసుకోగా, మరిన్ని పురోగతిలో ఉన్నాయి. ఇక్కడ అభివృద్ధి జరుగుతున్నా దానికి అనుగుణంగా అవసరమైన మౌలిక వసతుల కల్పన, పారిశుధ్య నిర్వహణ సరిగా లేదు. దీంతో ఎంతో విశాలమైన రోడ్లతో కనిపించే ఉప్పల్ భగాయత్‌లో ఎక్కడ చూసినా చెత్తాచెదారంతో పాటు పొంగిపొర్లుతున్న మ్యాన్‌హోల్స్ దర్శనమిస్తున్నాయి. లేఅవుట్‌ను హెచ్ఎండీఏ అభివృద్ధి చేసినా, ఈ ప్రాంత పరిధి జీహెచ్ఎంసీలోకి రావడంతో ఇక్కడ మౌలిక వసతుల కల్పన విషయంలో రెండు ప్రభుత్వ శాఖలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### లక్షల్లో లాగినా.. సమస్యలు తీరట్లే!

ఉప్పల్ భగాయత్ లేఅవుట్‌లో ప్రస్తుతం వందలాది మంది ఇంటి పన్ను చెల్లిస్తున్నారు. అదేవిధంగా కొత్తగా నిర్మాణాలు చేపట్టే వారు భవన నిర్మాణాల అనుమతుల కోసం జీహెచ్ఎంసీకి దరఖాస్తు చేసుకుంటే లక్షల్లోనే ఫీజులు చెల్లిస్తున్నారు. ఇలా రెండు విధాలుగా ప్రభుత్వానికి డబ్బులు చెల్లిస్తున్నా మౌలిక వసతుల కల్పనను ఏమాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఉప్పల్ భగాయత్‌లో పారిశుధ్య నిర్వహణ, మురుగునీటి పారుదల విషయాలను గాలికి వదిలేశారు. దీంతో ఎక్కడ చూసినా రోడ్ల వెంబడి చెత్తాచెదారం కనిపిస్తున్నది. ఉప్పల్ భగాయత్‌లో పలు చోట్ల మురుగునీరు గుంతల్లో నిండిపోయి దుర్వాసనకు తోడు దోమలు పెద్ద ఎత్తున వ్యాపిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. వీటికి తోడు భద్రత పరంగానూ పోలీసు శాఖ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.



ఉప్పల్ భగాయత్ లేఅవుట్‌లో రోడ్డుపై నిలిచిన మురుగునీరు

### అనుమతులు లేకుండా షెడ్ల నిర్మాణం

మౌలిక వసతుల లేమికి తోడు కొందరు ఇష్టారాజ్యంగా ఖాళీ స్థలాల్లో అనుమతులు లేకుండా షెడ్లు వేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. విశాలమైన రోడ్ల వెంబడి ఉన్న ఫుట్‌పాత్‌లను సైతం అక్రమించి వ్యాపార కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు. దీంతో ఉప్పల్ భగాయత్ లేఅవుట్‌లో సమస్యలు ఎదురవుతున్నాయని, ఈ విషయమై హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

## 'పది' ఫలితాల్లో హైదరాబాద్‌కు 30వ స్థానం

86.76 శాతం ఉత్తీర్ణత నమోదు

మే 3 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

సిటీబ్యూరో, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ) : పది ఫలితాల్లో హైదరాబాద్‌కు నిరాశనే ఎదురైంది. రాష్ట్ర వ్యాప్తంగా ఫలితాల్లో 30వ స్థానంలో నిలిచింది. హైదరాబాద్‌లో మొత్తం 86.76 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఇందులో బాలికలే ముందంజలో ఉన్నారు. బాలికలు 89.90 శాతం మంది ఉత్తీర్ణత సాధించగా బాలురు 83.41 శాతం ఉత్తీర్ణత నమోదైంది. హైదరాబాద్‌లో 73,202 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా.. 63,511 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. కాగా అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 3 నుంచి 13 వరకు నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. రంగారెడ్డి జిల్లాలో 91.01 శాతం ఉత్తీర్ణతను సాధించగా, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 89.61శాతం ఉత్తీర్ణత సాధించినట్లు అధికారులు తెలిపారు.